www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

మంగళవారం4, ఆగస్టు, 2026 8 పేజీలు

## ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు : కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం, భద్రాద్రి న్యూస్

సోమవారం ఐడీఓసీ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక..



3లో



## సాగునీటి ప్రాజెక్టులకు

# పర్యావరణ అనుమతులే లక్ష్యం

2 లో..

హైదరాబాద్, ఆగస్టు 3(భద్రాద్రి న్యూస్ ): రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత..
- దీనిని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి..
- పాలమూరు--రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు అత్యున్నత ప్రాధాన్యం..
- సుప్రీంకోర్టు తాజా తీర్పుతో అనుమతుల సాధనకు కొత్త అవకాశం..
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యం...
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల ప్రక్రియ పూర్తి..
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి..
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి..
- పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై శాస్త్రీయ అధ్యయనాలు వేగవంతం..
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి..

-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

## ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి



4లో



: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

భద్రాద్రి న్యూస్ ములుగు : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2026లో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ..

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ

# సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవు



3లో

భద్రాద్రి న్యూస్ ములుగు :

ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 దరఖాస్తులు రాగా, వాటిలో భూ సమస్యలు 11, ఇందిరమ్మ ఇళ్లకు 18, పెన్షన్లకు 26, ఇతర...

భద్రాద్రి న్యూస్

మంగళవారం4, ఆగస్టు, 2026

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం..









మొదటి పేజీ తరువాయి

సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గారి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ఎంపీ బలరాం నాయక్ గారు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత..

సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

### అంతర్రాష్ట్ర విభాగాన్ని మరింత బలోపేతం చేయాలి..

తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్---ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు.

ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు---ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు.

ఏడు రోజుల నుంచి ఆరు నెలల వరకు స్పష్టమైన కార్యాచరణ..

పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

ప్రధాన పరిపాలనా ప్రక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. పర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస--పునర్నిర్మాణ ప్రణాళికలు, అటవీ అనుమతుల దస్త్రాలు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల ప్రక్రియ ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు.

### రైతులు, నిర్వాసితుల హక్కులకు రక్షణ..

ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం---ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రాజెక్టుల కార్యాచరణ కొనసాగాలని సూచించారు.

### గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి..

గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గారు, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను---ఎస్ఓపీలను---కచ్చితంగా అమలు చేయాలన్నారు.

ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి స్వేచ్ఛాయుత ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను గుర్తించి, అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు.

అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్యం అత్యంత కీలకమైన అవరోధాలను తొలగించి, సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించగల సామర్థ్యంతో ప్రధాన కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు.

### అనుమతి రాగానే సీతారామ సాగర్ పనులు

సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు.

అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు.

ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయవ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

### ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసులకు సమన్వయ వ్యూహం..

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి న్యాయబృందం, శాఖాధికారులను ఆదేశించారు.

### పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత..

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా తెలంగాణలోని ప్రాంతాలపై పడే సంభావ్య ప్రభావాన్ని కూడా సమావేశంలో విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

తెలంగాణ వాదన కేవలం అంచనాలపై కాకుండా విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సంబంధిత ఇతర సంస్థల వద్ద రాష్ట్ర ప్రయోజనాలను దృఢంగా వినిపించాలని సూచించారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు పేర్కొన్నారు.

పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని సమావేశంలో స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణకు సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గారు ఆదేశించారు.

ఈ సమావేశంలో ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వీ. రమేష్‌బాబు గారు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ గారు, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్) పి.శ్రీనివాస్ గారు, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు గారు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ రివర్‌సైడ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం






**–సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి: డా. మల్లంపాటి నరసింహారెడ్డి...**

**భద్రాచలం, ఆగస్టు 3:**

రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం స్థానిక గోదావరి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రోటరీ పూర్వ గవర్నర్, ఇన్‌స్టాలేషన్ అధికారి డా. బూసిరెడ్డి శంకర్‌రెడ్డి నూతన అధ్యక్షుడు డా. మల్లంపాటి నరసింహారెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు.

క్లబ్ అధ్యక్షుడిగా డా. మల్లంపాటి నరసింహారెడ్డి, కార్యదర్శిగా డా. ప్రశాంత్ పోతురాజు, కోశాధికారిగా దొబ్బల రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని నూతన అధ్యక్షుడు డా. మల్లంపాటి నరసింహారెడ్డి తెలిపారు.

ముఖ్య అతిథి ఐటీసీ లిమిటెడ్ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ రోటరీ సంస్థలు సమన్వయంతో మరింత సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితుడు భద్రాచలం డీఎస్పీ మాచర్ల అరుణ్‌కుమార్ రోడ్డు భద్రతపై అవగాహన, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అసిస్టెంట్ గవర్నర్ కోటేరు వెంకటరెడ్డి నూతన సభ్యుల చేరిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే రోటరీ సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా బాచినేని రామకృష్ణ ఎన్నికైనట్లు డా. బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ప్రకటించారు.

కార్యక్రమంలో ఐటిసి పిఆర్‌ఓ చెంగల్ రావు మరియు క్లబ్ పూర్వాధ్యక్షులు మంగళగిరి హనుమంతరావు, డా. మడిపెద్ది రమేష్‌బాబు, ధనకొండ రాఘవయ్య, గంజి సంపత్‌తో పాటు పలువురు సభ్యులు, ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ

# సమస్యలను పరిష్కరించాలి.

మొదటి పేజీ తరువాయి



శాఖలకు సంబంధించినవి 12 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గతవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాలవల్ల క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించలేకపోతే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, పై స్థాయి కార్యాలయంలో ఏ అధికారికి, ఏ విధంగా తమ సమస్యను తెలియజేయాలో క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజావాణి దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులను కూడా అధిక ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ కృష్ణవేణి, ఎస్ డి టి ప్రతాప్ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఆధునిక సదుపాయాల కల్పన

**శానిటరీ నాప్‌కిన్ ఇన్‌సినిరేటర్లను పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.**




**భద్రాద్రి న్యూస్ ములుగు:**

బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఆధునిక సదుపాయాల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సూచించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి శానిటరీ నాప్‌కిన్ ఇన్‌సినిరేటర్ యంత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు, కేజీబీవీ జిల్లా సమన్వయ అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ గత ఏడాది స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పంపిన ప్రతిపాదనల మేరకు ఈ ఏడాది జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మొత్తం 27 శానిటరీ నాప్‌కిన్ ఇన్‌సినిరేటర్ యంత్రాలు జిల్లాకు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటిలో బీసీ సంక్షేమ శాఖకు ఒకటి, మైనారిటీ సంక్షేమ శాఖకు రెండు, ఎస్సీ సంక్షేమ శాఖకు ఒకటి, విద్యాశాఖకు పది, గిరిజన సంక్షేమ శాఖకు పదమూడు యంత్రాలు కేటాయించినట్లు వెల్లడించారు.

బాలికల ఆరోగ్య పరిరక్షణలో రుతుక్రమ పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, విద్యాసంస్థల్లో వినియోగించిన శానిటరీ నాప్‌కిన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

యంత్రాలను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు ప్రతి నెల వాటి వినియోగ వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలోని స్వచ్ఛ భారత్ మిషన్ విభాగానికి సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

త్వరలో సాంకేతిక నిపుణులు సంబంధిత విద్యాసంస్థలకు వచ్చి యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది, చల్వాయి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించాలి





**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం.**

**: అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

మత్తు పదార్థాల వల్ల సమాజంలో అనేక దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నందున వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, మత్తు పదార్థాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ అన్నారు.

సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ డ్రగ్స్‌పై అవగాహన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లో సహజసిద్ధమైన మత్తు పదార్థాలు, సింథటిక్ డ్రగ్స్ అనే రెండు రకాల మత్తు పదార్థాలు అక్రమంగా అందుబాటులో ఉన్నాయని, వాటి తయారీ, రవాణా, విక్రయాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన లేకపోయినా ఎవరైనా రైతులు గంజాయి సాగు చేస్తే రైతుబంధు సాయం నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువత, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు అత్యుత్సాహం ప్రదర్శించాలనే ఉద్దేశంతో మత్తు పదార్థాలను సేవిస్తూ తమ బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం ఈగల్ ప్రత్యేక బృందాల ద్వారా గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు,

# ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు : జిల్లా కలెక్టర్ అంకిత్

మొదటి పేజీ తరువాయి

సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్‌ఓ పద్మావతి లతో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అత్యంత కీలక వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

శాఖల మధ్య సమన్వయం, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని కలెక్టర్ అన్నారు . ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి

మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో అన్ని వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు బీఎల్వోల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, గుర్తించలేని వారు, మరణించిన వారి జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, మారిన ఓటర్ల జాబితాపై బీఎల్ఏల సంతకాలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే వారందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వీఐపీలు, వీవీఐపీల ఓటరు మ్యాపింగ్‌ను సహాయ ఎన్నికల నమోదు అధికారులు స్వయంగా పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైన్ షాపుల సిండికేట్ దోపిడీపై ఉక్కుపాదం మోపాలి

**అధిక ధరల విక్రయాలు, బెల్టు షాపులకు అక్రమ సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలి: న్యాయవాది బోడ వినయ్ కుమార్**

**కారేపల్లి, ఆగస్టు 3(భద్రాద్రి న్యూస్ రాములు ):**



సింగరేణి మండలంలో వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరలకు మద్యం విక్రయించడం, గ్రామాల్లోని అక్రమ బెల్టు షాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేయడం వంటి వ్యవహారాలపై ఆబ్కారీ శాఖ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది బోడ వినయ్ కుమార్ డిమాండ్ చేశారు.

ప్రజలు, పాత్రికేయులు పలుమార్లు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా, కేవలం నామమాత్రపు తనిఖీలు నిర్వహించి హెచ్చరికలతో సరిపెడుతున్నారే తప్ప, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా కొందరు వైన్ షాపుల యజమానులు యథేచ్ఛగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ, గ్రామాల్లోని అక్రమ బెల్టు షాపులకు ప్రతిరోజూ ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయించడం, లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించడం, అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం విక్రయించడం, అక్రమంగా మద్యం రవాణా చేయడం వంటి చర్యలు తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968లోని 34, 36, 41 సెక్షన్ల ప్రకారం శిక్షార్హమైన నేరాలు అని పేర్కొన్నారు.

అదేవిధంగా తూనికలు, కొలతల చట్టం--2009లోని 18, 36 సెక్షన్ల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించడం కూడా చట్టవిరుద్ధమని తెలిపారు. అలాంటి వారిపై జరిమానాలు, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు.

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తమ విధులను నిర్లక్ష్యం చేస్తే, భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని 223వ సెక్షన్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయవాది తెలిపారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేసే అధికారం ఆబ్కారీ శాఖకు ఉందని, అందువల్ల జిల్లా ఆబ్కారీ అధికారులు, ప్రాంతీయ ఆబ్కారీ కమిషనర్, ఆబ్కారీ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నతాధికారులు స్పందించని పక్షంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భారత రాజ్యాంగంలోని 226వ అధికరణం ప్రకారం తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు న్యాయవాది బోడ వినయ్ కుమార్ తెలిపారు.

ఈ వ్యవహారంలో రాష్ట్ర ఆబ్కారీ శాఖ ప్రధాన కార్యదర్శి, ఆబ్కారీ కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్, సంబంధిత ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాపుల యజమానులను ప్రతివాదులుగా చేర్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

సింగరేణి మండలంలో మద్యం సిండికేట్ దందా, అధిక ధరల వసూళ్లు, బెల్టు షాపులకు అక్రమ సరఫరాపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమ మద్యం విక్రయాలపై మీడియాలో వరుస కథనాలు...**

# అయినా అధికారుల చర్యలు శూన్యమా?

**ప్రజల ఫిర్యాదులు ఒకవైపు... మీడియాలో కథనాలు మరోవైపు... అయినా మార్పు ఎక్కడ?**

**“మా కుటుంబాలు నాశనం అయిన తర్వాతే స్పందిస్తారా?” అంటూ సింగరేణి మండల ప్రజల ఆవేదనలి**

**కారేపల్లి,ఆగస్టు 3, (భద్రాద్రి న్యూస్ రాములు ) :**





సింగరేణి మండలం లో అక్రమ మద్యం విక్రయాలపై గత కొంతకాలంగా మీడియాలో వరుస కథనాలు వెలువడుతున్నాయని, ప్రజలు కూడా పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

“మీడియాలో పదేపదే కథనాలు వస్తున్నాయి... ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు... అయినా సమగ్ర తనిఖీలు జరిగాయా? ఫిర్యాదులపై విచారణ చేపట్టారా? చేపట్టితే ఫలితాలను ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు? అక్రమాలు లేవంటే అధికారికంగా స్పష్టం చేయండి. ఉంటే వాటిని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి?” అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

గ్రామాలు, కాలనీల్లో అక్రమ మద్యం విక్రయాలపై వస్తున్న ఫిర్యాదుల కారణంగా అనేక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. మద్యం వ్యసనం వల్ల కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని, మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యువత భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొంటున్నారు.

**ప్రజల ఆవేదన ఒక్కటే...**

“మా కుటుంబాలు నాశనం అయిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? మా గోడు వినేది ఎవరు? మీడియా కథనాలు, ప్రజల ఫిర్యాదులు కూడా చర్యలకు దారితీయకపోతే సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? మా బాధను నిర్లక్ష్యం చేయకుండా, వాస్తవాలను వెలికితీసి ప్రజలకు న్యాయం చేయాలి.” అని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలు కోరేది ఆరోపణలు కాదు... పారదర్శక విచారణ.

ప్రజలు కోరేది ప్రచారం కాదు... చట్టప్రకారం చర్యలు.

అందుకే సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక బృందాలతో సమగ్ర తనిఖీలు నిర్వహించి, అందిన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ చేపట్టి, వాస్తవాలను అధికారికంగా ప్రజలకు వెల్లడించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, చట్టం అందరికీ సమానమనే నమ్మకాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు.

“ప్రజల కన్నీళ్లకు సమాధానం మాటల్లో కాదు... చర్యల్లో కనిపించాలి” అని సింగరేణి మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గ్రామాభివృద్ధికి జిపిడిపి ప్రణాళికే దిక్సూచి

**టేకులగూడెం గ్రామసభలో సర్పంచ్ గుమ్మడి సందీప్**




**కారేపల్లి, ఆగస్టు 3: (భద్రాద్రి న్యూస్ రాములు)**

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి పునాదని, గ్రామాభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) అమలు ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టేకులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ గుమ్మడి సందీప్ అన్నారు.

సోమవారం టేకులగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి ప్రణాళిక, బాలలు, బాలికలు, మహిళల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని తొమ్మిది ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# “మహిళలను అడ్డుపెట్టుకుని చెత్త రాజకీయాలు మానుకోండి

**‘రేగా’ను లక్ష్యంగా చేసుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు..!!**

**రాజకీయ కక్షతో తప్పుడు కేసులు అబద్ధపు ప్రచారాలు అశ్వాపురం మండల BRS పార్టీ కమిటీ**



భద్రాద్రి న్యూస్ అశ్వాపురం : మహిళలను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి కోసం చెత్త రాజకీయాలకు పాల్పడటం సరికాదని,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆరోపణలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని నాయకులు మండిపడ్డారు. ఒక గిరిజన నాయకుడి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం బాధ్యతాయుతమైన రాజకీయాలకు ఏమాత్రం తగదన్నారు.దర్యాప్తు పూర్తికాకముందే ఎవరినైనా దోషిగా చిత్రీకరించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.రాజకీయంగా ఎదుర్కోలేక అబద్ధపు ప్రచారాలు,అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి ప్రచారాలతో కొందరు క్షణిక ఆనందం పొందవచ్చేమో గానీ,ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని,నిజానిజాలను గుర్తించే తీర్పు ప్రజలదేనని స్పష్టం చేశారు.”మా నాయకుడు రేగా అంటే నిప్పు...ఆ నిప్పును చేత్తో పట్టుకోవాలని ప్రయత్నిస్తే కాలేది మీ చేతులే.జాగ్రత్తగా రాజకీయాలు చేయండి.వ్యక్తిత్వ హననానికి పాల్పడకుండా ప్రజా సమస్యలపై చర్చించండి”అంటూ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి అసత్య ప్రచారాలు చేసినా ప్రజల్లో తమ నాయకత్వానికి ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గదని,రాజకీయ కక్షతో చేసే ప్రతి ప్రయత్నానికీ ప్రజలే తగిన సమాధానం చెబుతారని వారు పేర్కొన్నారు....

ఈ కార్యక్రమం లో మండల BRS పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జునరావ్, సూది రెడ్డి గోపిరెడ్డి,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్,నక్కనబొయిన పాపారావు,మండల యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ,కళ్యాణపురం ఉప సర్పంచ్ చల్లా రాజేష్,మల్లెలమడుగు ఉపసర్పంచ్ గాడిద మహేష్,కోడి గంగన్న,గొర్రెముచ్చు వెంకటరమణ,కడారి వేణు,మంగళగిరి రామకృష్ణ,మందా హుస్సేన్,శెట్టిపల్లి శేఖర్,కుక్కల రాంబాబు,జినక సంపత్,కడారి సైదులు,జయ కృష్ణా, సిద్దు, పవన్, రత్నం, శ్రీను,పున్నారావు,కిరణ్,నాగేశ్వరరావు,భద్రం,తదితర యువజన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు...

# పీసా మొబలైజర్ల అడ్రస్ ఎక్కడ... వారు ఉన్నట్టా

**-- ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో వారే కీలకం... అయినా వారు కనబడరు... అధికారులు పట్టించుకోరు...**

**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):-**



కామేపల్లి మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన గ్రామపంచాయతీలో కీలక విధులు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు... అడ్రస్ లేకుండా పోయారు.... వారు కనపడరు... అధికారులు పట్టించుకోరు ...ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు అవగాహన కల్పించడానికి గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పీసా మొబలైజర్ల ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏజెన్సీ లోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరిని నియమించారు. వీరు గ్రామ పంచాయతీల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి గ్రామ సభలకు గిరిజనులు హాజరయ్యేటట్లు చూడాలి గ్రామ సభలను బలోపేతం చేయడానికి సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం ఉపాధి హామీ పథకం,గిరిజన సంక్షేమ పథకాలు గ్రామ సభల ద్వారా జరిగేటట్లు చూసి గిరిజనులకు అవగాహన కల్పించడం పిసా మొబలైజర్ల బాధ్యత భూమి,ఆటవి హక్కులు, గిరిజనుల ఇతర సమస్యలను గ్రామసభలో చర్చించి అనుమతులు తీసుకోవటం గ్రామాల్లో ఎస్ హెచ్ జి,వాటర్ కమిటీలు,స్కూల్ కమిటీలను గ్రామ సభ ఆధీనంలోకి తేవడం వీరి ప్రధాన బాధ్యత... ఇంతటి కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు గ్రామాల్లో కనీసం కనిపించిన దాఖలాలు లేవు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారుల లెక్కల ప్రకారం కేవలం 10 గ్రామాలకే పీసా మొబలైజర్లు ఉన్నట్లు మిగతా 14 గ్రామ పంచాయతీ లకు లేరని మండల అధికారులు తెలిపారు.ఈ గ్రామ పంచాయతీలో ఉన్న పిసా మొబలైజర్లు కనీసం ఆయా గ్రామ పంచాయతీలు నిర్వహించే గ్రామసభల్లో సర్పంచులు అధికారుల కంటికి కనిపించడం లేదు. వారిని గైడ్ చేయాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ఇళ్ల వద్ద కూర్చొని ఈ మొబలైజర్లు జీతాలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. దీనిపై మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రి ని వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని గ్రామపంచాయతీలో ప్రతిరోజు వారు హాజరైనట్లు చర్యలు తీసుకుంటామని ఉల్లంఘించిన వారికి షోకాజు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.మీరు మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు తీసుకున్న ఐదు నెలల తర్వాత వారిపై తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించగా ఇప్పుడు చర్యలు తీసుకుంటానని చెప్పడం కోస మెరుపు

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు





**భద్రాద్రి న్యూస్, ములుగు**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కశిందేవిపేట గ్రామపంచాయతీ రామయ్యపల్లి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి రామయ్యపల్లి సర్పంచ్ వంకుడోత్ నిరోషా అమర్ సింగ్, కళ్లి సమ్మక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే సీడీపీఓ శిరీష సూపర్వైజర్ రమాదేవి , అంగన్వాడీ టీచర్ శోభారాణి , ఆయా కవిత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు, లబ్ధిదారులు మరియు గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం ముగ్గురు పిల్లలకు చేయడం జరిగింది. తల్లిపాల యొక్క ప్రాముఖ్యత, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, అనంతరం తల్లిపాలతో పాటు అనుబంధ పౌష్టికాహారం అందించాల్సిన విధానం గురించి వివరంగా అవగాహన కల్పించడం జరిగింది.

అలాగే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు మరియు మహిళలు తీసుకోవాల్సిన సమతుల్య పౌష్టికాహారం, రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన సూచనలు అందించడం జరిగింది.

చివరిగా తల్లిపాలను ప్రోత్సహిస్తూ, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాది వేయాలని సందేశం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఆసక్తిగా పాల్గొని, తల్లిపాల ప్రాముఖ్యత , పౌష్టికాహారం గురించి అవగాహన పొందారు.

# పేద విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయించిన దాతృత్వం..!

**రాళ్లపురం పాఠశాల చిన్నారులకు కొత్త దుస్తులు అందించిన నిరంజన్--సౌజన్య దంపతులు**

**చర్ల ఆగస్టు 3 భద్రాద్రి న్యూస్**





నేటి కాలంలో చాలామంది సామాజిక బాధ్యతలను విస్మరిస్తున్న వేళ, నిరంజన్--సౌజన్య దంపతులు తమ సేవా భావంతో ఆదర్శంగా నిలిచారు. చర్ల మండలంలోని రాళ్లపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు కొత్త దుస్తులను పంపిణీ చేసి చిన్నారుల ముఖాల్లో ఆనందాన్ని నింపారు. కొత్త దుస్తులు అందుకున్న విద్యార్థులు ఉత్సాహంగా కనిపించగా, గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దాతలను హృదయపూర్వకంగా అభినందించారు.

ఈ సందర్భంగా నిరంజన్--సౌజన్య దంపతులు మాట్లాడుతూ, రాళ్లపురం గ్రామంలోని విద్యార్థులు సరైన దుస్తులు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ మిత్రుడు మద్ది లక్ష్మీనరసింహారెడ్డి ద్వారా తెలుసుకుని వెంటనే సహాయం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

“విద్యే గ్రామీణాభివృద్ధికి పునాది” అని పేర్కొన్న వారు, విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందితే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అవసరమైన వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

చర్ల మండల యువ నాయకులు బోరా పెద్దిరెడ్డి, పరిటాల సంతోష్ మాట్లాడుతూ, నిరంజన్--సౌజన్య దంపతుల సేవా కార్యక్రమం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఇలాంటి దాతలు పెరిగితే పేద విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగొందుతుందని అన్నారు.

దుస్తులు అందుకున్న విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేయగా, గ్రామస్తులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు షబీనా, మద్ది లక్ష్మీనరసింహారెడ్డి, గడ్డం సాయి, సృజన్, కొట్టే నవీన్, మూషిక ప్రవీణ్, బాలరాజు, అంగయ్య, భీమయ్య, ఉంగయ్య, గ్రామస్తులు, తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు భూదానం..

### పేరేపల్లి అంగన్వాడీ భవన నిర్మాణానికి 200 గజాల స్థలం విరాళం

**కారేపల్లి, ఆగస్టు 03 (భద్రాద్రి న్యూస్--రాములు):**



కారేపల్లి మండలం పేరుపల్లి-2 అంగన్వాడీ కేంద్రానికి పర్సా సూర్యప్రకాశరావు కుటుంబ సభ్యులు 200 గజాల భూమిని దానం చేశారు. దీనికి సంబంధించి దానపత్రాలను పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రంకు పర్సా కుటుంబ సభ్యులు అందజేశారు.

ఈ స్థలంలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి అనుమతి ఇస్తూ పంచాయతీ పాలకవర్గం ఆమోదించిన తీర్మానాన్ని సోమవారం ఐసీడీఎస్ అధికారులకు సర్పంచ్ అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి బానోత్ పద్మావతి వీరభద్రం మాట్లాడుతూ.. చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విలువైన భూమిని దానం చేసిన పర్సా సూర్యప్రకాశరావు--ఛాయాదేవి కుటుంబ సభ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సత్యశీల, అంగన్వాడీ ఉపాధ్యాయినులు సుశీల, సీత, విజయ తదితరులు పాల్గొన్నారు.

### ముచ్చర్ల టు ఏనుకూర్
### ఆర్ అండ్ బి రోడ్ ను పునర్ నిర్మించాలి

**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):-**





కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల క్రాస్ రోడ్ నుండి ఏన్కూర్ వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతు ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ మండల నాయకుడు బాదావత్ శ్రీను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముచ్చర్ల క్రాస్ రోడ్డు నుండి ఏన్కూరు--వరకు ఉన్న ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతు చేయాలని సీపీఎం మండల నాయకుడు బాదావత్ శ్రీను ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆయన గత ఐదేళ్లుగా ఈ రహదారి దయనీయ స్థితిలో ఉందని,రోడ్డు మరమ్మతుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, నిరసనలు నిర్వహించడంతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రతిరోజూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై క్రింద పడటంతో దానితోపాటు యాక్సిడెంట్ అవ్వడం ద్వారా కాళ్లు,చేతులు విరగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిని ఇకనైనా అధికారులు వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి సంబంధిత అధికారులను నిలదీస్తామని బాదావత్ శ్రీను హెచ్చరించారు.

# పొన్నెకల్ భూ సేకరణ గ్రామసభ కు హాజరైన డిప్యూటీ కలెక్టర్



**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):- కామేపల్లి**

మండలంలోని పొన్నెకల్ గ్రామంలో జరిగిన ఎస్ ఆర్ ఎల్ ఐ పి పంపిణీ కాల ప్యాకేజీ గ్రామ సభకు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ సదానందం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసే కన్నా తక్కువ గురించి వివరించారు.పెగ్ మార్క్ మార్కింగ్ పని ప్రారంభమైందని అధికారులు ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు,ఆర్ ఐ విజయ భాస్కర్ గ్రామ సర్పంచ్ గుగులోత్ భూమిక పాల్గొన్నారు.

# పిల్లలలో అభ్యసన ఫలితాల సాధనే ధ్యేయంగా పనిచేయండి





### - జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం

**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):-**

విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధనే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం జిల్లా అకాడమిక్ అధికారి ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని సోమవారం ముచ్చర్ల- జాస్తి పల్లి హైస్కూల్ ను వారు సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనం ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట పాత్రలను కూడా శుభ్రం చేసుకున్న తర్వాత మాత్రమే వంట ప్రారంభించాలని సూచించారు.పక్కపక్కనే ఉన్న ముచ్చర్ల జాస్తిపల్లి ప్రాథమిక పాఠశాలల పిల్లలను ఒకే దగ్గర ఉంచి బోధనాభ్యాసన ప్రక్రియలను నిర్వహించాలని మండల విద్యా శాఖ అధికారి కి సూచించారు.ఆ పాఠశాలల హెచ్ఎం లు,ఏపీసి సర్పంచ్ ల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు.

# రామచంద్రపురం వద్ద భారీగా టేకు కలప పట్టివేత






### వాహనం సీజ్.
### రూ నాలుగు లక్షల విలువైన కేకు దిమ్మలు స్వాధీనం

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్**

ములుగు జిల్లా వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని, రామచంద్రపురం వద్ద సోమవారం తెల్లవారుజామున నమ్మదగిన సమాచారంతో అటవి శాఖ అధికారుల అప్రమత్తమయ్యారు.

ఈమెరకు ఒక వాహనంలో టేకు కలపను రవాణా చేస్తూ, ఫారెస్ట్ అధికారులకు పట్టు పడ్డారు. పట్టుబడిన టేకు కలప విలువ సుమారు రు.నాలుగు లక్షల పైగా ఉంటుందని అంచనా. సెక్షన్ ఆఫీసర్లు జై సింగ్, లక్ష్మయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, మరియు బేస్ క్యాంపు సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. టేకు కలపతో పట్టుబడిన వాహనాన్ని వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. టేకు కలప దిమ్మలను కొలతలు వేసి, అటవీ శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. చత్తీస్గఢ్ అటవీ ప్రాంతం నుండి టేక్ కలప అక్రమ రవాణా ములుగు జిల్లా వెంకటాపురం ప్రధాన రహదారి వైపు తరలిస్తున్నట్లు, నమ్మదగిన సమాచారంతో, అధికారులు కాపుగాసి పట్టుకున్నారు. టేకు కలప అక్రమ రవాణాలను అడ్డుకొని పట్టుకున్నందుకు అటవి అధికారులు ను ఆశాఖ ఉన్నతాధికారులు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# 6కేజీల గంజాయి 38 బాటిళ్ల దగ్గు మందు స్వాధీనం




**కోదాడ, ఆగస్టు 03(భద్రాద్రి న్యూస్ ):**

కోదాడ పట్టణ సీఐ శివశంకర్ నాయక్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా టీం ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణ పరిధిలోని దేగ బాబు కల్యాణ మండపం సమీపంలో నిందితుల నుండి 6 కేజీల గంజాయి, 38 బాటిళ్ల దగ్గు మందును స్వాధీనం చేసుకుంది. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. కోదాడ పట్టణానికి చెందిన పంది వినోద్, షేక్ మగ్దుం పాషా, ఆవిడి రాఘవలు, అనంతగిరి మండలానికి చెందిన రవితేజ, షేక్ ఇర్ఫాన్లతో పాటు ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ సుభానిలను పట్టణ సీఐ నేతృత్వంలో ప్రత్యేక టీం దాడి నిర్వహించి పట్టుకుని వారి నుండి 6 కేజీల గంజాయి 38 దగ్గు మందు బాటిళ్లు, ఒక బైక్ను రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రవితేజ ఒడిశా నుండి గంజాయి కొనుగోలు చేసి కోదాడకు తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడు. అతడి ద్వారా ఇతర నిందితులు కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఖమ్మం పట్టణంలో మెడికల్ జనరల్ స్టోర్ యజమాని సుభాని ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా దగ్గు మందు విక్రయిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా టీమ్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు యువత, విద్యార్థులు టార్గెట్ గా, వారితో పాటు ఆటో డ్రైవర్లకు గంజాయి సరఫరా చేసి సంఘ విద్రోహక చర్యలకు పురి కోల్పోతున్నారన్నారు. ఈ దాడిలో ముగ్గురు బాల నేరస్తులు కూడా ఉన్నట్లు తెలిపారు. గంజాయి సరఫరాకు పాల్పడ్డ మరికొందరిని త్వరలో గుర్తించి అరెస్టు చేయనున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలు సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు, పోలీస్ అధికారులకు తెలియజేయాలని డీఎస్పీ కోరారు. ఈ కేసును చేధించిన పట్టణ సీఐ శివశంకర్, ఎస్ఐ అజయ్ కుమార్, ఇతర పోలీసులకు రివార్డుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.

భద్రాద్రి న్యూస్
మంగళవారం4, ఆగస్టు, 2026

# అమరజీవి సున్నం రాజయ్య ఆశయాలే నేటికీ పోరాటాలకు దిక్సూచి..!

### ఆదివాసీల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతకు ఘన నివాళులు

**చర్ల, ఆగస్టు 3 భద్రాద్రి న్యూస్:**
ఆదివాసీల హక్కుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య ఆరవ వర్ధంతిని చర్ల మండల కేంద్రంలోని బీస్ రామయ్య భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు బందెల చంటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సున్నం రాజయ్యకు భావోద్వేగపూర్వకంగా నివాళు లర్పించారు.ముందుగా సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "సున్నం రాజయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి, ప్రజాసేవ నేటికీ ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకం. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు ప్రతిరూపంగా నిలిచిన ఆదివాసీ ముద్దుబిడ్డ సున్నం రాజయ్యను ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువలేరు" అని అన్నారు. ఈ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు సున్నం రాజయ్య అని పేర్కొన్నారు. పోడు భూములకు పట్టాలు, పేదలకు ఇంటి స్థలాలు, ఆదివాసీల అటవీ హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. నిరుపేదలకు ఉపాధి భరోసా కల్పించిన ఉపాధి హామీ చట్టం అమలుకు కూడా ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. "ఈ ప్రాంతంలో నేడు కనిపిస్తున్న అభివృద్ధి, ఆదివాసీలకు లభించిన అనేక హక్కులు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుకు సున్నం రాజయ్య చేసిన పోరాటాలే బలమైన పునాది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే గొప్ప నివాళి" అని మచ్చ రామారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బందెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, భీమగొని నవీన్ కుమార్, దొడ్డి హరినాగవర్మ, ఉడుగుల షారోను, వరదల వరలక్ష్మి, కట్టం స్పందన, కొట్టే నవీన్, బోయిళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొని అమరజీవి సున్నం రాజయ్య సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు.




# మానల ప్రభాకర్ బీనామీగ ఉన్న దడిగెల శ్రీను ల దోపిడి నీ అరికట్టాలి

### సి పి ఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య చంద్ర అరుణ డిమాండ్




**గుండాల, ఆగస్టు 3( భద్రాద్రి న్యూస్):-**
సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు 3వ తారీకు సోమవారం. పెట్రోల్ బంక్ సెంటర్లో మండల జనరల్ బాడీ జరపడం జరిగింది ఈ జనరల్ బడి కి గుండాల మాజీ సర్పంచ్ కొమరం శాంతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ లు మాట్లాడుతూ గుండాల మండలం పూర్తిగా ఏజెన్సీ మండలం ఇక్కడ ఐదవ షెడ్యూల్ 1/ 70 చట్టం అమల్లో ఉంది కాబట్టి పోడు భూమి ఎక్కువ ఉన్న ప్రాంతం ఇక్కడ పెట్టుబడి రైతులకు ఇస్తూనే దాని మూసుకులో అప్పులు ఇచ్చి ఆస్తులు తీసుకోవడం చట్టానికి విరుద్ధం ఈ ప్రాంతంలో ఈ విషయం అవలం బించడం సరైనది కాదు కనుక మానాల ప్రభాకర్. ఆయన బినామీ దడిగల శ్రీను. ఈ ప్రాంతంలో కొంత మంది పేదలకు అప్పులు పెంటి ఇల్లు ఆస్తులు గుంజు కోవడం సరిఅయింది కాదు. చట్ట విరుద్ధంగా వ్యాపారం చేస్తూనే అమాయక ప్రజలను వాడుకుంటే ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఒక విప్లవ పార్టీగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తుంది.చట్టా ని మరియు ఐక్యతను కాపాడాలని పిలుపునిస్తోంది. కార్యక్రమంలో. జిల్లా నాయకులు మాచర్ల సత్యన్న డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్న. మండల నాయకులు తెల్ల రాజు. పూణేం లక్ష్మన్న పుణ్యం మంగయ్య. కోడూరు జగన్. మోకాల అజాద్ సనప కుమార్ యనగంటి గణేష్. రమేష్ ఈసం చంద్రన్న వుకే బాబు. కల్తి పాపన్న. రామన్న. దుర్గం లక్ష్మీనారాయణ ఎట్టి రాంబాబు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్‌కు సర్పంచ్ లావుడ్య పూర్ణ వినతి



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):-**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లపాడు (పెద్దతండా) గ్రామపంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ సోమవారం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. రేగళ్ల నుండి కరకవాగు వరకు ఆర్ ఓ బి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనుల్లో షోల్డర్ల నిర్మాణానికి ప్రమాణాలకు విరుద్ధంగా చెరువు మట్టిని వినియోగిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. MoRTH Specifications for Road and Bridge Works (Clause-305) , ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం రహదారి ఎంబాంక్‌మెంట్ నిర్మాణంలో అప్రూవల్ చేసిన మట్టిని మాత్రమే ఉపయోగించాలని , కానీ నాణ్యతలేని చెరువు మట్టిని వినియోగించడం వల్ల భవిష్యత్తులో రహదారి బలహీనపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని సర్పంచ్ కోరారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారులు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ఆయన పేర్కొన్నారు.
ఈ మేరకు జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రహదారి నిర్మాణ పనులు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ లావుడ్య పూర్ణ విజ్ఞప్తి చేశారు.

# పొలం బాట... రైతు పాత్ర



### ఉపాధ్యాయుని వినూత్న ఆలోచన

### వ్యవసాయంపై విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన

### పొలంలో నాట్లు వేస్తూ విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు.

### పాఠశాల టీచర్ విజయ్ వినూత్న కార్యక్రమం.









**వెంకటాపురం నూగూరు ఆగస్టు 3**
**భద్రాద్రి న్యూస్, ములుగు జిల్లా :**

వెంకటాపురం మండలం, మరికాల కొత్తూరు ఎంపీపీ పాఠశాల టీచర్, పాఠ శాల విద్యార్థులకు వ్యవసాయం, దాని విలువ, రైతు కష్టం, ప్రకృతితో అనుబంధం గురించి ప్రత్యక్షంగా తెలియజేయాలనే లక్ష్యంతో, మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (పీఎస్) ఉపాధ్యాయులు కాపుల విజయ్, వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాఠశాల విద్యార్థులను సమీపంలోని వరి పొలానికి తీసుకెళ్లి, రైతుల సహకారంతో, స్వయంగా వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా వరి సాగు విధానం, నారు పెంచడం, పొలం సిద్ధం చేయడం, నాట్లు వేయడం, పంట సంరక్షణ, నీటి నిర్వహణ, పంట కోత వరకు జరిగే ప్రతి దశను విద్యార్థులకు సులభంగా వివరించారు.విద్యార్థులు బురదలోకి దిగి ఉత్సాహంగా నాట్లు వేస్తూ, రైతు శ్రమను ప్రత్యక్షంగా అనుభవించారు. పాఠ్యపుస్తకాల్లో చదివే అంశాలను క్షేత్రస్థాయిలో చూపించడం వల్ల విద్యార్థులకు, వ్యవసాయం పట్ల ఆసక్తి పెరగడంతో పాటు, అన్నదాత పట్ల గౌరవభావం కూడా పెరుతుందని అన్నారు.

ఈ సందర్భంగా కాపుల విజయ్ మాట్లాడుతూ, "దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియజేయాలని, విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, ప్రకృతి పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం కూడా పాఠశాలల బాధ్యత" అని అన్నారు.

గ్రామస్థులు, రైతులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి అనుభవాత్మక బోధన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల చైతన్యం, శ్రమకు గౌరవం, ప్రకృతి పరిరక్షణపై బాధ్యత పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**
**భద్రాద్రి న్యూస్ ములుగు**




స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానం లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్టేజి ఏర్పాట్లు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరిశీలించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు స్టాల్ లు ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసే ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన త్రాగునీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బంది అందరితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, ఎస్ డి సి ప్రతాప్, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.